సాక్షి పశ్చిమగోదావరి

శనివారం • 9 • ఆగస్టు • 2025



పాములదిబ్బలో ఉద్రిక్తత

ఏలూరు పాములదిబ్బలో మరోసారి ఉద్రిక్తత నెలకొంది. రెండు నెలల క్రితం జరిగిన హత్య కేసులో నిందితుడి ఇంటికి ప్రత్యర్థులు నిప్పుపెట్టారు. 8లో ▸



అడవి తల్లి బిడ్డలు

పశ్చిమ ఏజెన్సీలోని కొండరెడ్డి గిరిజనులు నేటికీ కొండలపై నివసిస్తూ.. సంప్రదాయ పంటలు పండించడంతో పాటు, అటవీ ఉత్పత్తులు సేకరించి ఉపాధి పొందుతున్నారు. 8లో ▸



సాక్షి కథనాలకు స్పందన

తాడేపల్లిగూడెం, కొయ్యలగూడెంలో పారిశుద్ధ్య లోపం, రహదారుల మరమ్మతులపై 'సాక్షి' పత్రికలో ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. 8లో ▸

తప్పు తాగించేందుకు పర్మిట్

- మద్యం నుంచి సంపద సృష్టిలో చంద్రబాబు సర్కారు
- షాపుల వద్ద పర్మిట్ రూంలకు గ్రీన్‌సిగ్నల్
- త్వరలో వెలువడనున్న ఆదేశాలు
- ఇప్పటికే విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు



మద్యం దుకాణంలో లూజ్ సేల్స్



మద్యం దుకాణాల వద్ద అనధికార పర్మిట్ రూమ్‌లు

సాక్షి, భీమవరం: మద్యం నుంచి సంపద సృష్టి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇప్పటికే బెల్టులు, సమయ పాలన లేకుండా విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తూ మద్యాన్ని ఏరులై పారిస్తోంది. మందుబాబుల్ని మరింత తప్పతాగించి ఆదాయాన్ని పెంచుకునే పనిలో ఉంది. షాపులకు అనుబంధంగా పర్మిట్ రూంల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. గీత కార్మికులకు చెందిన 18 షాపులతో కలిపి జిల్లాలో 193 మద్యం షాపులు ఉన్నాయి. నెలకు రూ.120 కోట్ల వరకు అమ్మకాలు జరుగుతున్నాయని అంచనా. మునుపటి ఏడాది ప్రామాణికంగా 20 శాతం అమ్మకాలు పెంచాలంటూ మొదట్లో ఎక్సైజ్ అధికారులకు టార్గెట్లు విధించేవారు. ప్రైవేట్ పాలసీ తెచ్చిన గత ఏడాది అక్టోబరు 16 నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి లిక్కర్, బీర్ల అమ్మకాల్లో 30 శాతం నుంచి 80 శాతం పెరుగుదలను గుర్తించింది. మరింత ఆదాయాన్ని రాబట్టేందుకు నెలవారీ టార్గెట్ మొత్తాన్ని రూ. 175 కోట్లకు పెంచేసినట్టు సమాచారం. లక్ష్యాన్ని చేరేందుకు ఉన్నతస్థాయి నుంచి రోజువారీ సమీక్షలతో ఎక్సైజ్ అధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

చూసీచూడనట్టుగా..

షాపుల వద్దనే మద్యం సేవించేందుకు వీలుగా టేబుళ్లు, కుర్చీలతో సిట్టింగ్ ఏర్పాట్లు, మంచింగ్ కోసం ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, సోడాలు, కూల్‌డ్రింక్స్, లూజ్ సేల్స్‌తో మద్యం దుకాణాలను 'బార్'ల మాదిరి నిర్వహిస్తున్నారు. నైట్‌పాయింట్లు పేరిట తెల్లవార్లూ అమ్మకాలు చేస్తున్నారు. ఒక్కో షాపు పరిధిలో పది వరకు బెల్టు విక్రయాలు షరామామూలే. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు చేస్తున్నా కూటమి నేతల ఒత్తిళ్లు, టార్గెట్ల కోసం అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. బెల్టుషాపులు లేవని ప్రభుత్వం చెబుతుండగా జిల్లాలో ఇప్పటి వరకు 370 మంది బెల్టుషాపుల నిర్వాహకులను అరెస్టు చేసి 800 లీటర్ల మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకోవడం గమనార్హం.

పర్మిట్‌కు పచ్చజెండా

సిండికేట్‌కు మేలుచేస్తూ 2014–19 మధ్య కాలంలో లిక్కర్ విధానాన్ని చంద్రబాబు సర్కారు మళ్లీ ఆచరణలో పెడుతోంది. అందులో భాగంగా మద్యాన్ని ప్రైవేట్ పరం చేసింది. షాపులకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లు తెరిచే పనిలో ఉంది. సెప్టెంబరు 1 నుంచి కొత్త బార్లకు లైసెన్సులు అమలుల్లోకి వచ్చాక పర్మిట్ రూమ్‌ల ఏర్పాటుకు మార్గం సుగమం కానుంది.

జిల్లాలోని దాదాపు అన్ని షాపులకు పర్మిట్ రూమ్‌ల ఏర్పాటుకానున్నట్టు ఎక్సైజ్ వర్గాలు అంటున్నాయి. ప్రస్తుతం మద్యం దుకాణాల వద్ద మద్యం సేవించడం నిబంధనలకు విరుద్ధం. అయినప్పటికి సిండికేట్లు పర్మిట్ రూంల మాదిరి ఏర్పాట్లతో మద్యం, గ్లాసులు, వాటర్ బాటిల్స్, ఫాస్ట్ ఫుడ్స్ తదితర అన్నిటి ధరలను పెంచేసి మందబాబులను దోచేస్తున్నారు. వీటిని అధికారికం చేయడం ద్వారా సిండికేట్ దోపిడీకి అడ్డుండదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం చాలావరకు దుకాణాలు జనావాసాల మధ్యలో ఉండగా మందుబాబుల ఆగడాలతో చుట్టుపక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. పర్మిట్ రూమ్‌తో వారు మరింత రెచ్చిపోయి స్థానికంగా ప్రశాంత వాతావరణానికి భంగం కలుగుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తమవుతోంది.

నాడు	నేడు
వైఎస్సార్‌సీపీ హయాంలో మద్యం దుకాణాలు ఊరికి దూరంగా ఉండేవి. ప్రభుత్వమే నిర్వహించడం వలన నిబంధనలు ఖచ్చితంగా అమలయ్యేవి. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్ణీత వేళల్లో మాత్రమే అమ్మకాలు చేసేవారు. షాపు వద్ద మద్యం కొనుగోలు చేసి తీసుకుపోవడమే తప్ప అక్కడే కూర్చుని తాగే వీలుండేది కాదు. బెల్టుషాపులు, పర్మిట్ రూమ్‌లకు ఆస్కారమే లేదు. ఎమ్మార్పీకి మించి అధిక ధరల ఊసే లేదు. మద్యంపై వచ్చే ఆదాయం మొత్తం ప్రభుత్వ ఖజానాకు చేరేది.	కూటమి తెచ్చిన ప్రైవేట్ పాలసీతో మద్యం దుకాణాలు జనావాసాలు, రద్దీ ప్రాంతాల్లోకి వచ్చేశాయి. ఊరురా బెల్టుషాపులు వెలిశాయి. క్వార్టర్ బాటిల్‌కు ఎమ్మార్పీపై మద్యం దుకాణాల్లో రూ.10, బెల్టుషాపుల్లో రూ.30 వరకు వసూలు చేస్తున్నారు. ఎప్పుడు పడితే అప్పుడు, ఎక్కడ పడితే అక్కడ మద్యం దొరుకుతుండటంతో మందుబాబులు మత్తులో ఒకరిపై ఒకరు దాడులకు తెగబడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. ఒక్కోసారి హత్యలకు సైతం దారితీస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

ఓటరు జాబితా సవరణ ఆపాలి



భీమవరంలో నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

భీమవరం: ప్రత్యేక సమగ్ర సర్వే (ఎస్ఐఆర్) పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం చేస్తున్న ఓటర్ల జాబితా సవరణను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తమకు వ్యతిరేకంగా ఉన్న రాష్ట్రాలలో తన పెత్తనం కోసం ప్రతిపక్షాల ఓటు బ్యాంక్‌ను తొలగించడానికే సవరణను ఆయుధంగా చేసుకుందని, దానికి ఎన్నికల సంఘం వత్తాసు పలుకుతుందని విమర్శించారు. గతంలో ఎన్నికల సంఘం జారీ చేసిన ఓటరు గుర్తింపు కార్డులు, ఆధార్ కార్డులను కూడా ఈ సవరణలో పరిగణనలోకి తీసుకోకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎస్ఐఆర్ సర్వేను దేశమంతా అమలు చేయాలని చూస్తుందని ఒక పక్క ఎన్నికల ప్రక్రియలో ఉన్న లోపాలపై చర్చ జరుగుతుండగా మరోపక్క సర్వే పేరుతో ఓటర్లను గందరగోళపర్చడం, తొలగించడం అన్యాయమన్నారు. కేంద్ర ఎన్నికల సంఘాన్ని స్వతంత్ర సంస్థగా కాకుండా కేంద్ర ప్రభుత్వం తన జేబు సంస్థగా మార్చేసిందని గోపాలన్ దుయ్యబట్టారు. తక్షణమే ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని నినాదాలు చేశారు. సీపీఎం జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, ఇంజేటి శ్రీనివాస్, ఎం.ఆంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, గోపాలకృష్ణంరాజు, త్రిమూర్తులు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

12న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ సమావేశం



ఎస్సీ సెల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కైకలూరు: వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా విస్తృత స్థాయి సమావేశ పోస్టర్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు తేర ఆనంద్ మాట్లాడుతూ ఈ నెల 12న కంద్రికగూడెం సుఖీభవ కల్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్.సుధాకర్‌బాబు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, ఇతర రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు విచ్చేస్తారన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్ బాబు, జిల్లా అధికార ప్రతినిధి ముస్నుల జాన్ గురునాథం, దేవదాసు ప్రేమబాబు, యూత్ నాయకులు కోడిముక్కల నాగేశు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశక్తిపై నిర్బంధం తగదు



ఏపీఎస్‌టీఏ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న కాడిశెట్టి శ్రీనివాసులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యాశక్తి కార్యక్రమాన్ని నిర్బంధం చేయడం తగదని స్కూల్ టీచర్స్ అసోసియేషన్(ఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు అన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జీజేఏ స్టీవెన్‌తో కలిసి ఏలూరులోని జీజే రెసిడెన్సీలో జరిగిన ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశక్తి కార్యక్రమం ఐచ్ఛికంగా నిర్వహించాలని పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ తెలిపారని, కొన్ని జిల్లాల్లో విద్యాశక్తి కార్యక్రమాన్ని నిర్బంధంగా నిర్వహించమనడం సబబు కాదన్నారు. విద్యార్థులు సాయంత్రం నాలుగు గంటలకు అలసిపోతారని, ఆ సమయంలో విద్యాశక్తి అని చెప్పి అదనంగా తరగతులు నిర్వహించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. విద్యాశక్తిపై ఎవరినీ నిర్బంధం చేయవద్దన్నారు. చాలామంది ఉపాధ్యాయులు అదనపు తరగతులు నిర్వహించి వారి సిలబస్‌ను పూర్తి చేసి వెనుకబడిన విద్యార్థులకు రెమిడియల్ తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం దాటినా పీఆర్సీ, డీఏల ఊసెత్తకపోవడం దారుణమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లులు పెట్టి సంవత్సరాలు గడుస్తున్నా చెల్లింపులు చేయకపోవడం సమంజసం కాదన్నారు. కార్యక్రమానికి ఏలూరు జిల్లా అధ్యక్షుడు కాటి వెంకటరమణ అధ్యక్షత వహించగా, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు ఉర్ల గంధర్వరావు, అసోసియేట్ అధ్యక్షుడు పిట్ట ఫెడ్రిక్ బాబు, మహిళా అధ్యక్షురాలు జీ సంధ్యారాణి, సీనియర్ నాయకులు కే బాలరాజు, టీ అంజిబాబు, దాసరి యేసు పాదం, కే జేమ్స్, డీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



జి.కొత్తపల్లిలో రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు, పోలీసులు

ద్వారకాతిరుమల: మండలంలోని జి.కొత్తపల్లిలో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసిన ఓ ఇంటిపై సివిల్ సప్లై అధికారులు శుక్రవారం రాత్రి దాడి చేశారు. దాడిలో రూ. 1.50 లక్షలు విలువైన 3,750 కేజీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన మాటూరి దుర్గారావు జి.కొత్తపల్లి గ్రామంతో పాటు, చుట్టుపక్కల గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి.. బియ్యాన్ని జి.కొత్తపల్లిలోని ఉపాధిహామీ కూలి దాసరి రాజు ఇంట్లో నిల్వ చేస్తున్నాడు. రాత్రి సమయాల్లో గుట్టుచప్పుడు కాకుండా ఆ బియ్యాన్ని బయటకు తరలిస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం సివిల్ సప్‌లై డిప్యూటీ తహసీల్దార్‌లు నాగరాజు, వెంకటేశ్వరరావు, వీఆర్‌ఏ బ్రహ్మయ్యలు ఆ ఇంటిపై దాడి చేశారు. అనంతరం పోలీసుల సమక్షంలో గది తలుపులు తెరచి 75 రేషన్ బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు.

వేదంతో పులకించిన సరిపల్లె



వేద పరీక్షకు హాజరైన వివిధ రాష్ట్రాల వేద విద్యార్థులు, వేద పండితులు

గణపవరం: గణపవరం మండలం సరిపల్లె గ్రామం వేదపండితులు, ఘనాపాఠీలు, వేద విద్యార్థుల పాదస్పర్శతో పులకరించింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు చెందిన వేదవిద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకోవడానికి ఇక్కడ నిర్వహించే వేద పరీక్షలకు హాజరయ్యారు. వీరిని పరీక్షించడానికి వేదపారాయణం, పాండిత్యంలో ఆరితేరిన వేదపండితులు, ఘనపాఠీలు పరీక్షాధికారులుగా విచ్చేశారు. సరిపల్లెలోని సఖ్యాభివర్ధక నిలయంలో గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో 105వ వేదశాస్త్ర పరిషత్ మహా సభలు మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. గణపవరానికి చెందిన సాగిరాజు సుబ్బరాజు ఆర్థిక సహకారంతో గత మూడు దశాబ్దాలుగా సరిపల్లె టీటీడీ కల్యాణమండపంలోని ఈ వేదశాస్త్ర పరిషత్ మహాసభలు నిర్వహిస్తున్నారు. వేదవిద్యార్థులకు ఇక్కడ రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలలో పరీక్షలు నిర్వహించి, ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందచేస్తారు. ఏటా శ్రావణ శుద్ధ పౌర్ణమి రోజును నిర్వహించే వేదపరిషత్ సభలో ఉత్తీర్ణులైన వేద విద్యార్థులకు ఉత్తీర్ణత సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. గురు, శుక్రవారాలలో నాలుగు వేదాలలో నిర్వహించిన పరీక్షలకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల తోపాటు, బిహార్, రాజస్థాన్, ఒడిశా, తమిళనాడు, మహారాష్ట్ర తదితర 10 రాష్ట్రాల నుంచి 130 మంది వేద విద్యార్థులు హాజరయ్యారు.

గతంలో ఇక్కడే పరీక్ష రాశాను



నేను తితిదే వేదపాఠశాల ప్రధానాచార్యుడిగా పదవీ విరమణ చేశాను. 35 ఏళ్లగా ఇక్కడ వేద పరీక్షలకు పరీక్షాధికారిగా వస్తున్నాను. వేదాల పరిరక్షణకు అందరూ కృషి చేయాలి. ప్రస్తుతం 30 మంది వేద విద్యార్థులను కృష్ణ యజుర్వేదంలో పరీక్షించాను.

–గుళ్లపల్లి విశ్వనాథ ఘనాపాఠీ, హైదరాబాద్

విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాను



వేదపరీక్షలకు దశాబ్దకాలంగా పరీక్షాధికారిగా వస్తున్నాను. విశాఖపట్నంలో శుక్ల యజుర్వేదంలో శిక్షణ ఇస్తున్నాను. ఏటా ఒక బ్యాచ్ చొప్పున ఎంపిక చేసుకుంటాను. ఒక్కో బ్యాచ్‌కు పదకొండు సంవత్సరాలు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది.

– రాపర్తి నరేంద్రకుమార్ ఘనాపాఠీ, విశాఖపట్నం

శుక్ల యజుర్వేద ప్రొఫెసర్‌గా..



మాది నేపాల్. చిన్నతనంలోనే అస్సాం వచ్చి వేద పాఠశాలలో వేద విద్యనభ్యసించాను. ప్రస్తుతం తిరుపతిలోని వెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో శుక్లయజుర్వేదంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాను. పది మంది వేద విద్యార్థులకు పరీక్ష నిర్వహించాను.

– గోవిందప్రసాద్ అధికారి, శుక్ల యజుర్వేద పరీక్షాధికారి

ఇక్కడి సర్టిఫికెట్లకు ప్రాధాన్యత



మాది రాజస్థాన్. అక్కడ రెండేళ్లు వేద విద్య, హైదరాబాద్‌లో రెండేళ్లు, కుంభకోణంలో ఏడాది, విశాఖపట్నం వేదపాఠశాలలో మూడేళ్లు సామవేదం అభ్యసించాను. ఇక్కడ ఉత్తీర్ణత సాధిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పడంతో పరీక్ష రాయడానికి వచ్చాను.

– రోహిత్‌శర్మ, రాజస్థాన్

న్యాయం జరిగే వరకూ పోరాటం

- దళిత శ్మశాన వాటికలో రోడ్డు వేస్తారా?
- పాములపర్రులో దళిత సంఘాల నేతల ఆగ్రహం
- కూటమి నాయకులు, పోలీసుల మైండ్‌గేమ్



పాములపర్రులో దళితులను సమావేశపరచి మాట్లాడుతున్న వివిధ సంఘాల నాయకులు

ఉండి: మండలంలోని పాములపర్రు దళిత శ్మశాన వాటికలో ఆక్వా రైతుల కోసం రోడ్డు వేయాలనే నిర్ణయంపై వివాదం రోజు రోజుకు ముదురుతోంది. శుక్రవారం మాల మహానాడు సంఘాలు, కేవీపీఎస్, సీపీఎం, అంబేడ్కర్ ఎంప్లాయిస్ యూనియన్, అంబేడ్కర్ మిషన్ వంటి సంఘాల నాయకులు పాములపర్రు దళితులను పరామర్శించి శ్మశాన వాటికను పరిశీలించారు. పాములపర్రు ఘటనపై పోలీసుల దౌర్జన్యాన్ని వారు తీవ్రంగా ఖండించారు. శ్మశానం జోలికి ఎవరు వచ్చినా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ఎమ్మెల్యేకు ఎందుకింత కక్ష?: దళిత సంఘాల నేతలు

స్థానిక ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుకు దళితులపై ఎందుకంత కక్ష అని వారు ప్రశ్నించారు. కార్యాలయంలో కూర్చుని ఆదేశాలివ్వడం కాదని శ్మశాన వాటికకు వచ్చి చూస్తే రోడ్డు ఎవరికోసం వేస్తున్నారో అర్థమవుతుందని అన్నారు.ఎవరో ఇద్దరు ఆక్వారైతుల కోసం రోడ్డు వేయిస్తూ వందల మంది దళితులను ఎందుకు బాధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 150 ఏళ్ల నుంచి గ్రామంలో దళితుల శ్మశాన వాటిక భూమిని ఇప్పుడు కాదంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రతి దళిత పేటకు రెండెకరాల వరకు భూమి ఇవ్వాలని ప్రభుత్వ జీవో చెబుతుంటే ఇప్పుడు ఆ భూమిలో రోడు వేస్తామనడంపై మండిపడ్డారు. ప్రభుత్వ రికార్డులను మాలమహానాడు నాయకులు అడుగుతుంటే సర్వే, రెవెన్యూ శాఖాధికారులు ఎందుకు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరు ఇలాగే ఉంటే ఉద్యమం తీవ్రతరం కాక తప్పదని వివిధ సంఘాల నాయకులు హెచ్చరించారు. సామరస్యంగా సమస్య పరిష్కారం కావాలంటే ముందుగా 144 సెక్షన్ ఎత్తేసి పోలీసులు వెళ్లిపోవాలని వారు డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్, జిల్లా అధ్యక్షుడు గుండు నగేష్, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్, దానం విద్యాసాగర్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే క్రాంతిబాబు, జిల్లా అధ్యక్షుడు విజయ్, సీపీఎం జిల్లా నాయకుడు ధనికొండ శ్రీనివాస్, అంబేడ్కర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మధు, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, అంబేడ్కర్ మిషన్ నియోజవకర్గ నాయకులు ఉన్నారు.

మండల వ్యాప్తంగా 144 సెక్షన్

దళితులపై దాడులే జరగలేదంటూ స్థానిక ఎమ్మెల్యే బుకాయిస్తున్నా ఉద్యమ తీవ్రతను ముందుగానే పసిగట్టిన పోలీసు ఉన్నతాధికారులు పాములపర్రు గ్రామంలోనే కాకుండా మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు మండలంలో ప్రచారం చేయించారు. పోలీసుల ద్వారా భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలను కూటమి నాయకులు చేస్తున్నారని దళితులు ఆరోపిస్తున్నారు.

దళితులకు వేధింపులు

144 సెక్షన్ సాకుతో ఇతర గ్రామాల నుంచి దళితులు పాములపర్రు రాకుండా అడ్డుకునే ప్రయత్నాలు సఫలం కాకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలపై పోలీసులు, కూటమి నాయకులు దృష్టి సారించారు. పాములపర్రు దళితుల ఫోన్ నెంబర్లు సంపాదించి వారికి ఫోన్‌లు చేస్తూ మీ మీద ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించారు.. ఇక మీ పని అయిపోయిందని భయపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. పోలీసులు గుట్టుచప్పుడు కాకుండా కొందరు దళితులకు ఫోన్ చేసి ఎవరివైనా పది పేర్లు చెప్పాలని.. లేదంటే ఏ1గా నీ పేరు పెట్టాల్సి ఉంటుందని ఇబ్బందిపెడుతున్నారంటూ గ్రామానికి చెందిన కొందర దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న బ్రాంచ్ అధ్యక్షుడు హరికుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెన్షనర్లకు ప్రభుత్వం చెల్లించాల్సిన డీఆర్, పీఆర్సీ బకాయిలు తక్షణమే చెల్లించాలని, తాత్కాలిక భృతి 30 శాతం వెంటనే ప్రకటించాలని గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన సలహాదారు వీకే వీరారావు, ప్రధాన కార్యదర్శి వైవీఎస్ మూర్తి, జిల్లా కోశాధికారి వి.రామ్మోహన్‌లు డిమాండ్ చేశారు. పెన్షనర్ల జిల్లా కార్యవర్గ సమావేశం తాడేపల్లిగూడెం పట్టణంలో బ్రాంచ్ అధ్యక్షుడు బి.హరికుమార్ అధ్యక్షతన జరిగింది. వక్తలు మాట్లాడుతూ మూడు డీఆర్ బకాయిలతో సహ అన్ని బకాయిలు ప్రకటించాలని, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆర్థిక నివేదిక, కార్యదర్శి నివేదికలను సభలో ఏకగ్రీవంగా ఆమోదించారు. నరసాపురం యూనిట్ కోశాధికారి స్వామి నాయుడు, తాలూకా యూనిట్ అధ్యక్షుడు ఎం.మార్కండేయులు, ఆర్.రామకృష్ణరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.హరనాథ కృష్ణ, పెన్షనర్లు పాల్గొన్నారు.

ఇంటింటా శ్రావణ శోభ



ద్వారకాతిరుమలలో కుంకుళ్లమ్మకు కూరగాయలు, పళ్లతో అలంకరణ




భీమవరంలో మావుళ్లమ్మకు లక్ష గాజులతో అలంకరణ

శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మహిళలు భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం పూజలు వైభవంగా, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పూజ అనంతరం మహిళలు చేతికి తోరణాలు కట్టుకుని ముత్తైదువులకు తోరణాలు కట్టి వాయినాలు, తాంబూలాలు అందజేసి ఆశీర్వచనాలు తీసుకున్నారు. సాయంత్రం సమీపంలో ఉన్న అమ్మవారి ఆలయాలకు వెళ్లి అమ్మవార్లను దర్శించుకుని కుంకుమ పూజలు నిర్వహించారు. భీమవరంలో మావుళ్లమ్మ వారికి 9 లక్షల గాజులతో అలంకరణ చేశారు. మావుళ్లమ్మకు అజ్ఞాత భక్తులు సుమారు రూ. 11 లక్షల విలువ చేసే 108 బంగారు పుష్పాలను సమర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



మావుళ్లమ్మకు అజ్ఞాత భక్తులు అందించిన 108 బంగారు పుష్పాలు



పెనుగొండలోని ఓ ఇంట్లో వరలక్ష్మీ వ్రతానికి ఏర్పాట్లు



మార్టేరులో కనకదుర్గమ్మను బంగారు పూత కలిగిన వెండి చీరతో అలంకరించిన దృశ్యం

క్లుప్తంగా

టేబుల్ టెన్నిస్‌లో విద్యార్థి ప్రతిభ


గోపాలకృష్ణ

ఆగిరిపల్లి : రాష్ట్ర స్థాయిలో జరిగిన టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఆగిరిపల్లి మండల విద్యార్థి కాంస్య పతకం సాధించాడు. చొప్పరమెట్లలోని కేకేఆర్ హ్యాపీ వ్యాలీ పాఠశాల విద్యార్థి గోపాలకృష్ణ అండర్ 19 సింగిల్ విభాగంలో పాల్గొని ప్రతిభ చాటాడు. ఈ విజయం ద్వారా సీబీఎస్ఈ నేషనల్ లెవెల్ టేబుల్ టెన్నిస్ పోటీలకు అర్హత సాధించాడు. విద్యాసంస్థల చైర్మన్ కొనరాజు కోటేశ్వరరావు, సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

వరకట్నం వేధింపులపై కేసు నమోదు

భీమవరం: అదనపు కట్నం కోసం వేదిస్తున్నారంటూ భీమవరం పట్టణానికి చెందిన గోడి అనిత శుక్రవారం పోలీసులను ఆశ్రయించింది. వివరాల ప్రకారం అనితకు రాజమహేంద్రవరం మండలం మారంపూడికి చెందిన కోడి జాషువాజైకుమార్‌తో సుమారు ఆరేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లి సమయంలో రూ.5లక్షల నగదు, బంగారం కట్నంగా ఇచ్చారు. కొంత కాలం తరువాత భర్త కోడి జాషువాజైకుమార్ అతని కుటుంబ సభ్యులు రూ.10 లక్షలు అదనపు కట్నం తీసుకొని రావాలంటూ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. ఈ మేరకు అనిత ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ చెప్పారు.

బావిలో పడిన ఎద్దు


బావిలో పడిన ఎద్దును బయటకు తీస్తున్న ఫైర్ సిబ్బంది

కై కలూరు: ప్రమాదవశాస్తూ బావిలో పడిన ఎద్దును స్థానిక అగ్నిమాపక సిబ్బంది చాకచక్యంగా రక్షించిన ఘటన కైకలూరు రైతు బజారు ఎదురుగా శుక్రవారం జరిగింది. ఉదయం ఓ బలమైన ఎద్దు పాడుబడిన నూతిలో పడింది. భారీ శబ్దం రావడంతో ఓ వ్యక్తి గమనించి సమీపంలోని ఫైర్ ఆఫీస్‌లో సమాచారం అందించారు. హుటాహుటీన వచ్చిన సిబ్బంది శ్రీనివాసరావు, రాజేష్ బాబు, రవీంద్రబాబు మరో కొందరి స్థానికుల సాయంతో తాళ్లు కట్టి ఎద్దును రక్షించారు. ఇదే నూతిలో కొద్ది రోజుల క్రితం దూడ పడితే రక్షించామని స్థానికులు చెప్పారు. బావిపై మూత ఏర్పాటు చేయాలని యజమానికి సూచించారు.

ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్న పోలీసులు

కై కలూరు: క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుంటానని బంధువులకు సెల్ ఫోన్ మెసేజ్ పెట్టిన యువకుడిని కైకలూరు టౌన్ ఎస్సై ఆర్.శ్రీనివాస్ చాకచక్యంగా శుక్రవారం పట్టుకుని తండ్రికి అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఏలూరు జిల్లా తడికలపూడి గ్రామానికి చెందిన అందుగుల థామస్(20) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 4న కుటుంబ సభ్యులతో చిన్నపాటి గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఏలూరు నుంచి పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మావుళ్లమ్మ దేవాలయం వరకు కారుకు ఆప్టింగ్ డ్రైవర్‌గా వెళ్ళాడు. అక్కడ నుంచి సమీప సోదరుడు రత్నారావుకు తాను ఇటీవల జరిగిన గొడవకు మనస్థాపం చెందానని తనువు చాలిస్తోన్నానని మెసేజ్ పెట్టాడు. దీంతో వెంకటరత్నం టోల్‌ఫ్రీ నంబర్ 112కు ఫోన్ చేసి పోలీసులకు వివరాలు చెప్పాడు. సెల్ సిగ్నల్ ఆధారంగా ఆకివీడు నుంచి కైకలూరు మీదుగా ఏలూరు వెళ్లడానికి ఆర్టీసీ బస్సు ఎక్కిన థామస్‌ను కై కలూరులో టౌన్ ఎస్సై శ్రీనివాస్ గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చారు. యువకుడి తండ్రి లక్ష్మణరావును పిలిపించి ఇద్దరికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం యువకుడిని గుర్తించడంలో చొరవ చూపిన హెడ్‌కానిస్టేబుల్ నాగరాజును అభినందించారు.

అడవి తల్లి బిడ్డలు.. కొండరెడ్డి గిరిజనులు

- ప్రకృతే వారి ఆరాధ్య దైవం
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం


పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజన మహిళ


గిరిజన సాంప్రదాయ డోలు వాయిద్యాల నృత్యం చేస్తున్న గిరిజనులు


గిరిజన సాంప్రదాయి పంటలైన జొన్న పంటను రోకలితో దంచుకుంటున్న గిరిజన మహిళలు


ఎండీయూ వ్యవస్థ రద్దు కావడంతో రేషన్ బియ్యాన్ని మోసుకుంటూ వెళ్తున్న గిరిజనులు


వన దేవతకు పూజలు చేస్తున్న గిరిజనులు


అడవిలో లభించే చింతపండనును శుభ్రం చేస్తున్న గిరిజన వృద్ధురాలు

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ గిరిజన తెగల్లో కొండరెడ్డి గిరిజనుల తెగ ఒకటి. వీరు నేటికీ కొండలపై ఆవాసాలు ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటున్నారు. అక్కడే వారి సాంప్రదాయ పంటలైన జొన్న, సామలు, మొక్కజొన్న వంటి పంటలను పండిస్తూ జీవనం సాగిస్తున్నారు. అలాగే పలు గ్రామాల్లో వెదురు అల్లికలు, తేనె, చింతపండు, ఇప్ప పువ్వు వంటి అటవీ ఉత్పత్తులను సేకరిస్తుంటారు. వారాంతపు సంత, ఇతర ప్రభుత్వ కార్యాలయ పనుల మీద మాత్రమే కొండ దిగి కిందకు వస్తుంటారు. వీరికి ప్రధానంగా పోడు వ్యవసాయమే జీవనాధారం. సాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు కావొస్తున్నా నేటికీ కొండరెడ్డి గిరిజనులు కొండ ప్రాంతంలోనే జీవనం సాగిస్తూ వస్తున్నారు. ప్రకృతి మాత వడిలోనే జీవిస్తున్నారు.

నేటికీ చెక్కుచెదరని సాంప్రదాయం

నేటి ఆధునిక ప్రపంచంలో ఎవరి బ్రతుకులు వారివే, ఎవరి పనులు వారివే. అయితే కొండరెడ్డి గిరిజనులు నేటికీ నాటి సాంప్రదాయాలు, ఆచారాలకు కట్టుబడి ఉన్నారు. వ్యవసాయమే కాదు పెళ్లిళ్లు, పేరంటాలు ప్రతిదీ సమష్టిగా చేసుకునే సాంప్రదాయం కొనసాగుతూనే ఉంది. శుభకార్యాల్లో ఒకరికి ఒకరు సహకరించుకోవడం వంటివి నేటికీ చేస్తుంటారు.

ప్రకృతే గిరిజనుల ఆరాధ్య దైవం

ఆదివాసీ గిరిజనులు ప్రకృతినే ఆరాధ్య దైవంగా కొలుస్తుంటారు. రావి, వేప చెట్లను ముత్యాలమ్మగా భావిస్తారు. ముఖ్యంగా బాట పండుగ, పప్పుల పండుగ, మామిడికాయ పండుగ వంటి పండుగలను ఎంతో వైభవంగా చేస్తారు. అయితే గిరిజనుల్లోనే కోయ తెగ వారు భూదేవి పండుగను తొలకరి సమయంలో ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. నేటికీ ఈ పండుగ సాంప్రదాయం కొనసాగుతూనే ఉంది.

గత ప్రభుత్వ పాలనలో గిరిజన సంక్షేమానికి పెద్దపీట

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పెద్దపీట వేశారు. సుమారు 3,220 మంది గిరిజనులకు 69814.72 ఎకరాల్లో పోడు భూములకు పట్టాలిచ్చారు. అదేవిధంగా రైతు భరోసా పథకంలో రైతులకు ప్రతీ ఏటా రూ. 15000 పెట్టుబడి సాయం అందేలా కృషి చేశారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానంతో కొండ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులకు సైతం మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా కృషి చేశారు. అలాగే వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛన్లు కూడా కొండపైన ఉన్నవారికి కూడా ఇంటికే అందే విధంగా చర్యలు తీసుకున్నారు. గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందేలా సుమారు రూ. 50 కోట్లతో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి పూనుకున్నారు. అయితే ప్రస్తుతం నిర్మాణ పనులు నిలిచిపోయాయి. అలాగే మారుమూల గ్రామాల నుంచి డోలి కష్టాలు కూడా లేకుండా బైక్ అంబులెన్స్ సేవలను అందించారు.

గిరిజనులకు మళ్లీ కష్టాలు మొదలు..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన పథకాలకు ఒక్కొక్కటిగా మంగళం పలకుతుంది. గతంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ అందించేవారు. అయితే ప్రస్తుతం దానిని తొలగించడంతో మళ్లీ గిరిజనులకు వాగులు దాటుతూ తలపై బియ్యం పెట్టుకుని మైళ్ల దూరం నడిచే పరిస్థితులు వచ్చాయి. గతంలో వలంటరీ వ్యవస్థ ద్వారా కోడి కూయక ముందే మారుమూల కొండ ప్రాంతాల్లో ఉన్న వారికి సైతం అన్ని రకాల పింఛన్లు అందేవి. ప్రస్తుతం ఆ పింఛన్లు వారం రోజులు దాటితేకానీ అందే పరిస్థితి లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా వైద్యసేవలపై కూడా ఆందోళన చెందుతున్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వ పాలకులు తమకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా పాలన సాగించాలని గిరిజనులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో ఆయిల్‌పామ్ కార్మికుడి మృతి


రమేష్ మృతదేహం

జంగారెడ్డిగూడెం: విద్యుదాఘాతానికి గురై ఆయిల్ పామ్ కార్మికుడు మృతిచెందాడు. వివరాల ప్రకారం మండలంలోని తాడువాయి పరిధిలో గొల్లగూడెంలో చెరుకు ఫ్యాక్టరీ సమీపంలో రైతు కొప్పుల నాగేశ్వరరావు ఆయిల్ పామ్ తోటను లీజుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ తోటలోని ఆయిల్ పామ్ గెలలు నరికేందుకు జీలుగుమిల్లి మండలం స్వర్ణవారిగూడెంకు చెందిన తడికమళ్ల రమేష్ (35) శుక్రవారం పనికి వచ్చాడు. అక్కడ ఆయిల్ పామ్ గెలలు కోస్తుండగా, సమీపంలో ఉన్న విద్యుత్ లైన్‌కు గెలలు నరికే గెడ తగలడంతో విద్యుత్ ప్రవహించి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య చుక్కమ్మ, ఒక పాప ఉన్నారు. దీనిపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు.

ఆయిల్ పామ్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఆయిల్ పామ్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆయిల్ పామ్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం తెలిపారు. శుక్రవారం ఆయిల్ పామ్ కార్మికుడు తడికమళ్ల రమేష్ మృతి చెందడంతో ఘటనా స్థలానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్మికుల కుటుంబాలను ఆదుకునేవిధంగా ఆయిల్ పామ్ కంపెనీ గ్రూప్ ఇన్సూరెన్స్ ఏర్పాటు చేసి, రూ.10 లక్షలు వ్యక్తిగత భీమా ఇవ్వాలన్నారు. అలాగే ఆయిల్ పామ్ గెలలు సురక్షితంగా కోసే విధంగా కార్మికులకు శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

● రాఖీ.. సందడి



సోదర, సోదరీమణుల ఆప్యాయతానురాగాలకు ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి శనివారం కావడంతో తాడేపల్లిగూడెం పట్టణ, రూరల్ మండలంలో రాఖీల కొనుగోలులో యువతులు నిమగ్నమయ్యారు. పట్టణంలోని ప్రధాన రహదారికిరువైపులా ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్దకు యువతులు, మహిళలు చేరుకుని రాఖీలను కొనుగోలు చేశారు. రూ.20 నుంచి రూ.280 వరకు విలువైన రాఖీలను కొనుగోలుదారులకు అందుబాటులో ఉంచారు. అయితే స్టాల్స్ విరివిగా పెరగడంతో కొనుగోళ్లు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయని వ్యాపారులు పేర్కొన్నారు.

– తాడేపల్లిగూడెం రూరల్

సాక్షి ఎఫెక్ట్

జాతీయ రహదారి మరమ్మతులు ప్రారంభం


కొయ్యలగూడెంలో జాతీయ రహదారి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: స్థానిక జాతీయ ప్రధాన రహదారి అభివృద్ధికి నేషనల్ హైవే అధికారులు శుక్రవారం పనులను ప్రారంభించారు. జూలై 26న సాక్షిలో 'అధ్వాన రహదారులతో ఇక్కట్లు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు ఇటీవల చెక్ పోస్ట్ సెంటర్ నుంచి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వరకు ప్రమాదకరంగా ఉన్న రోడ్డు మార్జిన్‌ను పరిశీలించారు. అనంతరం పొక్లెయిన్‌తో రహదారిపై ఏర్పడిన మార్జిన్‌ను క్రమబద్ధీకరించే పనులను ప్రారంభించారు. రెండు రోజులలో పనులను పూర్తి చేసి రాకపోకలు పునరుద్ధరిస్తామని అధికారులు పేర్కొన్నారు. అప్పటివరకు డివైడర్‌కి ఒక పక్కనే రాకపోకలను సాగించడానికి ప్రయాణికులు సహకరించాలని కోరారు.

పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు చర్యలు


బ్లీచింగ్, ముగ్గు చల్లిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: భారీ వర్షాలు కురిస్తే రహదారులపై నీళ్లు నిలిచిపోతుండటం, పారిశుద్ధ్యం లోపిస్తుండటంపై 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. మండలంలోని మోదుగ గుంట, ఉప్పరగూడెం గ్రామాల్లో రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని మోటార్లు ఏర్పాటు చేసి, బయటకు పంపించే ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎం.వెంకటేష్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం రహదారులపై బ్లీచింగ్, ముగ్గు చల్లించారు.

నేత్రపర్వం.. పవిత్రాదివాసం


యాగశాలలో పవిత్రాదివాసాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


వేడుకలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో శ్రీవారి దివ్య పవిత్రోత్సవాలు నేత్రపర్వంగా నిర్వహిస్తున్నార. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి ఆలయ యాగశాలలో అర్చకులు పవిత్రాదివాసాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, అగ్నిప్రతిష్ఠాపన కార్యక్రమాలను అర్చకులు, రుత్వికులు అట్టహాసంగా చేశారు. అనంతరం పవిత్రాలకు పంచగవ్య ప్రోక్షణ, అభిమంత్రణలను నిర్వహించారు. అనంతరం శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవమూర్తుల వద్ద పవిత్రాలను ఉంచి పంచశయనాదివాసాన్ని వేద మంత్రోచ్ఛరణతో అర్చక స్వాములు నిర్వహించారు. ఆ తర్వాత మహాశాంతి హోమాలు, చతుర్వేద పారాయణ చేశారు.

పాములదిబ్బలో ఉద్రిక్తత


సంఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీస్ అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పాములదిబ్బలో మరోసారి ఉద్రిక్తత చోటుచేసుకుంది. రెండు నెలల క్రితం పాములదిబ్బకు చెందిన ముంగి యర్రబాబు ఏలూరు జాతీయ రహదారిపై హత్యకు గురయ్యాడు. ఈ కేసులో పాములదిబ్బ ప్రాంతానికి చెందిన కొందరు నిందితులుగా ఉండటంతో పోలీసులు వాళ్లను అరెస్ట్ చేశారు. హత్యకు గురైన వ్యక్తిని దహన సంస్కారానికి తీసుకువెళ్లే సమయంలోనే హతుడి కుటుంబ సభ్యులు నిందితుల ఇంట్లో సామాన్లు ధ్వంసం చేసి గందరగోళం సృష్టించారు. అప్పట్లో ఏలూరు డీఎస్పీ శ్రవణ్ కుమార్ ప్రత్యేక నిఘా, పోలీసు పికెట్ ఏర్పాటు చేసి శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు చేపట్టారు. ఈ విషయం సద్దుమణిగినా నివురుగప్పిన నిప్పులా ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే శుక్రవారం తెల్లవారుజామున హత్య కేసులో నిందితుడిగా ఉన్న దాసరి కుమార్ రాజా ప్రత్యర్థులు ఇంటికి నిప్పుపెట్టారు. దీంతో మళ్లీ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఏలూరు టూటౌన్ సీఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పాములదిబ్బలో మళ్లీ పోలీసు భద్రతను ఏర్పాటు చేశారు. ఇంటికి నిప్పు పెట్టిన ఘటనకు సంబంధించి హత్యకు గురైన యర్రబాబు తల్లి పెద్దింట్లుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యాసిడ్ మీద పడి మహిళ మృతి

పెదపాడు: రోడ్డు ప్రమాదంలో యాసిడ్ మీద పడి ఓ మహిళ మృతి చెందగా భర్తకు గాయాలైన సంఘటన పెదపాడు మండలంలోని తాళ్లమూడిలో శుక్రవారం చోటు చేసుకుంది. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు నుంచి ఏలూరుకు యాసిడ్ లోడుతో వెళ్తున్న ట్రక్కు ఆటోలో అల్లాబక్సు అనే వ్యక్తి తన భార్య షంషేర్‌తో కలిసి వెళ్తున్నారు. జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న వారు మార్గమధ్యలో పెదపాడు మండలంలోని తాళ్లమూడి వద్దకు వచ్చేసరికి టైర్ పంక్చర్ కావడంతో ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న యాసిడ్ మీద పడి భార్య షంషేర్(46) అక్కడికక్కడే చనిపోయింది. యాసిడ్ గాయాలైన భర్తను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మేజిస్ట్రేట్ వద్ద బాధితుడి వాంగ్మూలం నమోదు చేసినట్లు తెలిపారు. బాధితులు నెలకు రెండు సార్లు ఈ విధంగా యాసిడ్ తీసుకువచ్చి ఏలూరులో దుకాణాలకు సరఫరా చేస్తూ జీవనం సాగిస్తూ ఉంటారని చెప్పారు. ఈ మేరకు పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తృటిలో తప్పిన పెనుప్రమాదం


వెలంపేటలో మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

కైకలూరు: కేవలం 10 నిమషాలు అగ్నిమాపక సిబ్బంది ఆలస్యంగా వస్తే భారీ ప్రమాదం జరిగేది. కైకలూరు వెలంపేట మరిపి నాగేశ్వరరావు ఇంటి వద్ద వంట చేస్తున్న సమయంలో ఎల్‌పీజీ సిలిండర్ గ్యాస్ పైప్‌ను నుంచి ఒక్క సారిగా మంటలు వ్యాపించాయి. మంటలను అదుపు చేసినా ప్రయోజనం లేకపోవడంతో సమీప నివాసితులు భయంతో అరుస్తూ పరుగులు తీశారు. కొంతమంది ఫైర్ ఆఫీస్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి సిలిండరు నుంచి వచ్చే మంటలను అదుపు చేశారు. అప్పటికే సిలిండర్ పేలడానికి సిద్ధంగా ఉంది. సకాలంలో స్పందించిన అగ్నిమాపక సిబ్బందిని స్థానికులు అభినందించారు.

వరలక్ష్మీ వ్రతం పేరిట ధరల దోపిడీ


పట్టణంలోని పండ్ల దుకాణం

భీమవరం(ప్రకాశం చౌక్): వరలక్ష్మీ వ్రతం అంటేనే ఏడాదిలో తొలి పండగా భావించి ఏంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటారు. భక్తుల సెంటిమెంట్‌ను ఆసరాగా తీసుకొని పూజకు అవసరమైనన పండ్లు, పూలు, అరటి పండ్లు, కొబ్బరికాయల ధరలను పెంచి వ్యాపారస్తులు దోపిడీ చేశారు. జిల్లా వ్యాప్తంగా పూజా సామగ్రి ధరలు గురువారం మధ్యాహ్నం నుంచి అనూహ్యంగా పెరిగిపోయాయి. సాధారణ రోజుల్లో డజను అరటి పండ్లు రూ.50 నుంచి రూ.60 ఉంటే రూ.100 రూపాయలకు విక్రయించారు. లక్ష్మీదేవి అమ్మవారికి పూజకు ఎక్కువగా చామంతి పూలు వినియోగిస్తుంటారు. ఈ నేపథ్యంలో చామంతి పూల రేటు పెంచి కేజీ చామంతులు రూ.600 వరకు విక్రయించారు. కనకాంబరాలను కూడా మర రూ.150 నుంచి రూ.200, మల్లెపూలు రూ.100 నుంచి రూ.150 వరకు అమ్మకాలు చేశారు. తమలపాకులు మోద రూ.50 నుంచి 70 రూపాయలు, కొబ్బరి కాయలు చిన్నవి రూ.30, పెద్దవి రూ.40 రూపాయలు చొప్పున అమ్మకాలు చేశారు. వరలక్ష్మీ వ్రతం పండుగ పేరట ధరల బాగా పెంచడంతో సామాన్యుల వరలక్ష్మీ పూజ ఖర్చుకు ఇబ్బందులు పడ్డారు.

భార్యను లైంగికంగా వేధిస్తున్నారని భర్త ఫిర్యాదు

జంగారెడ్డిగూడెం: తన భార్యను ఓ యువకుడు లైంగికంగా వేధిస్తున్నారని ఓ భర్త శుక్రవారం పోలీసులను ఆశ్రయించాడు. వివరాల ప్రకారం ఫిర్యాదుదారుడు తన కుటుంబసభ్యులతో కలిసి జంగారెడ్డిగూడెంలో నివాసం ఉంటున్నాడు. అయితే తన ఇంటి సమీపంలో ఉన్న ఓ వ్యక్తి ఫిర్యాదుదారిడి భార్యను లైంగికంగా వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే అక్రమ సంబంధం ఉందని ప్రచారం చేస్తానని బెదిరిస్తున్నాడు. ఈ విషయాన్ని భార్య భర్తకు చెప్పడంతో ఈ నెల 7న రాత్రి ఫిర్యాదుదారుడు ఆ యువకుడిని పిలిచి మాట్లాడుతుండగా ఒక్కసారిగా ఆ యువకుడు దాడికి యత్నించాడు. దాడి సమయంలో యువకుడి బావమరిది కూడా సహకరించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ టి.బాబూరావు తెలిపారు.

ఆయిల్‌పామ్ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): ఆయిల్ పామ్ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, వీళ్లను కార్మికులుగా గుర్తించడం లేదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఏలూరు జిల్లాలో ఆయిల్ పామ్ తోటలో పనిచేసే కార్మికులు సుమారు పదివేల మంది ఉన్నారని వీరిని ప్రభుత్వం కార్మికులుగా గుర్తించడం లేదని దుయ్యబట్టారు. ఆయిల్‌పామ్ కోకో తోటల్లో పనిచేసే కూలీలు విద్యుత్ షాక్, విషపురుగులు కాటేసి పిట్టల్లా రాలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయిల్ పామ్ కార్మికుల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేయాలని, వాళ్లని కార్మికులుగా గుర్తించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశబూరు. నవభారత్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో కార్మికులకు ట్రైనింగ్ క్యాంపు ఏర్పాటు చేసి గ్రూప్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.10 లక్షల వ్యక్తిగత బీమా అమలు చేయాలని కోరారు.

క్లుప్తంగా

వాసవి మాతకు సారె అందజేత


వాసవి మాతకు సారె అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో కన్యకా వాసవి పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో వాసవి మాతకు పసుపు, కుంకుమ, గాజులు, చీరా సారె, పండ్లు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు వసుమర్తి అనిల్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యదర్శి మండా బ్రహ్మాజీ, కోశాధికారి శ్రీధర్ గుప్తా, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లేపర రాము, కోశాధికారి భోగవల్లి రమేష్, వాసవి సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫౌండర్స్‌డే


సెంట్రల్ బ్యాంకులో ఫౌండర్స్‌డే

తాడేపల్లిగూడెం (టీఓసీ): సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 144వ ఫౌండర్స్‌డే మహోత్సవాలు పట్టణంలోని బ్రాంచ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బ్రాంచ్ చీఫ్ మేనేజర్ షేక్ కరీమ్ ఖాతాదారులతో మాట్లాడుతూ బ్యాంక్ అందిస్తున్న హోం లోన్స్, ఎడ్యూకేషనల్ లోన్స్, ఇతర లోన్స్, డిపాజిట్స్, కొత్త స్కీంలను తదితర సేవలను వెల్లడించారు. ఖాతాదారులు పి.రాంబాబు, విశ్రాంత చీఫ్ మేనేజర్ వి.ఆనందరావులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

15న రాష్ట్ర స్థాయి పాటల పోటీలు

నరసాపురం: స్థానిక మదర్ థెరిస్సా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 15న రాష్ట్ర స్థాయి పాటల పోటీలు నిర్వహించనున్నట్టు ఆ సంఘ ప్రతినిధి రాబర్ట్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని వలందర్రేవులో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే పోటీల్లో అన్ని వయస్సులవారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలుతోపాటు షీల్డ్ అందిస్తామని తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.200, పూర్తివివరాలకు ఫోన్ నంబర్ 98480-26302లో సంప్రదించాలని పేర్కొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యతపై శుక్రవారం స్థానిక బస్టాండ్‌లో ప్రజలకు కళాజాత కళాకారులు అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పట్టణ ప్రాజెక్టు అధికారిణి ఎం ఉమ, ఏసీడీపీఓ నాగరత్నం, మల్లేశ్వరి, నాగ పద్మావతి, మోహనరాణి పాల్గొన్నారు.

ఆరోగ్యానికి పొగబెడుతున్నారు!

- ఎక్కడికక్కడే చెత్తకుప్పల దహనం
- చెత్తకు నిప్పు– పర్యావరణానికి ముప్పు


ప్రత్తిపాడు వై.జంక్షన్ దుర్గమ్మ గుడి వెనుక వెళ్లే దారిలో చెత్తకు నిప్పుపెట్టిన దృశ్యం

పెంటపాడు: పల్లెలో డంపింగ్ యార్డుల సమస్య దశాబ్దాల తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఉన్న డంపింగ్ యార్డుల్లో కొన్నేళ్ల నుంచి వ్యర్థాలు కొండల్లా పేరుకుపోయాయి. వాటికి చోటు లేదనే కారణంతో పారిశుద్ధ్య సిబ్బంది గ్రామాల్లో సేకరించిన చెత్తను ఎప్పటికప్పుడు తగులబెడుతున్నారు. దీని నుంచి వెలువడే దట్టమైన పొగతో సమీప నివాసితులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. కొన్ని గ్రామాల్లో తడి, పొడి వ్యర్థాలను వేరు చేస్తున్నారు. తడి చెత్తను సంపద కేంద్రాలకు తరలించి, సేంద్రీయ ఎరువు తయారు చేస్తున్నారు. మిగిలిన పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను డంపింగ్ యార్డులకు తరలించి గుట్టుగా నిప్పు పెడుతున్నారు. చెత్తను తరలించేందుకు గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛసంకల్పం రిక్షాలను మూలన పడేశారు. నేడు అవి కానరావడంలేదు. కూటమి ప్రభుత్వం ట్రాక్టర్లు కొనుగోలు చేశామని చెప్పుకొంటున్నారు. ప్రధాన వీధులలోనే తప్ప అవి చిన్న సందులలో రాకపోవడంతో అక్కడ డ్రెయినేజీల్లో చెత్త పేరుకుపోతోంది. ప్రధానంగా పలు గ్రామాల్లో వారంలో ఒక్క సారి కూడా చెత్త ట్రాక్టర్ మా వీధికి రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. పలు ప్రాంతాలలో డ్రెయినేజీలు తీయకపోవడం వల్ల అట్టలు కట్టి దుర్గంధం వెదజల్లుతోంది. వేసవి వచ్చినా దోమల బెడద అలానే ఉంది. చెత్తపై అవగాహన కల్పించాల్సిన అధికారులు మిన్నకుండి పోతున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా కానరావడం లేదు. ప్రత్యేక అధికారులు కూడా మొక్కుబడి పనులే. ప్రధానంగా చెత్తను నిర్మూలించే పనిలో ప్రజలదే నెపంగా వారిపైకి నెడుతున్నారు. చెత్తకు నిప్పు పెట్టడం వల్ల ప్లాస్టిక్ వ్యర్థాల పొగను పీల్చడం ద్వారా ఊపిరితిత్తుల వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రధానంగా ప్రత్తిపాడులో వై. జంక్షన్ దుర్గమ్మ ఆలయం, గాంధీరెడ్డి గోడౌన్, కాగులంపాడు రహదారి, ఆరుగొలను రోడ్డు, అలంపురం జయగార్డెన్, రావిపాడు రోడ్డు, పెంటపాడు స్మశానం, మీనవిల్లూరు రోడ్డు, కె. పెంటపాడు బంక్ ప్రాంతం తదితర ప్రాంతాలలో నిత్యం చెత్తకు నిప్పు పెడుతున్నారు. దీనివల్ల పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటోంది. అదే సమయంలో రహదారిపై విద్యార్థులు స్కూళ్లకు వెళ్తున్నారు. పొగ వల్ల కాలుష్యం దెబ్బతింటోంది. చిన్నారులకు పలు రకాలు వ్యాధులు ప్రబలుతున్నాయి. కాగులంపాడు స్కూలు వద్ద ప్రతి నిత్యం అలంపురంలో గ్రామంలో గత జగనన్న ప్రభుత్వంలో స్వచ్ఛ సంకల్పం కింద అందజేసిన చెత్త డబ్బాలను ప్రజలు ఇంకా అందించలేదని సమాచారం. పలు గ్రామాల్లో చెత్త డబ్బాలు అందించడం లేదని ప్రజలు చెబుతున్నారు. ఈ దారిన వెళ్లేవారు ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోంది. పొగవల్ల రహదారి కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. తక్షణం చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


ప్రత్తిపాడు గాంధీరెడ్డి గోడౌన్ వద్ద చెత్తకు నిప్పుపెట్టిన దృశ్యం


కాగులంపాడు స్కూల్ వద్ద చెత్తకు నిప్పుపెట్టిన పొగ స్కూలులోకి వెలుతున్న దృశ్యం

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


తణుకులో ఫ్రైడే డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: దోమ పుట్టుకను నివారించేందుకు ఖర్చురహితమైన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ప్రతి ఇంటా పాటించాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు జంగం చెర్వు ప్రాంతంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే, వెక్టార్ కంట్రోల్ హైజీన్, కీటకజనిత వ్యాధులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ఈ వర్షాకాలం సీజన్‌లో ప్రతిరోజూ డ్రైడే పాటించాలని ఇందులో భాగంగా గృహాల్లో ఫ్రిజ్ వెనుక ఉన్న వేస్ట్ వాటర్ కంటైనర్ లోని నీటిని తీసి శుభ్రం చేసుకోవాలని సూచించారు. నీటిని నిల్వ ఉంచే డ్రమ్ములపైన మూతలు ఉంచడం, ఇంటిపై భాగంలో ఉండే ఓవర్ హెడ్ ట్యాంక్‌పై తప్పనిసరిగా మూత ఏర్పాటుచేయడం వంటి జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిలిచి ఉంటే వేస్ట్ ఇంజన్ ఆయిల్ చల్లుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని కోరారు. వార్డు హెల్త్ సెక్రెటరీలు పి.మాధవి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రంలో పోషక యాజమాన్యంపై శిక్షణ


మాట్లాడుతున్న డాక్టర్ పి.ఉషారాణి

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్ఆర్ విశ్వ విద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రంలో ప్యాక్స్ వారి ఆర్థిక సాయంతో సమగ్ర పోషక యాజమాన్యంపై 15రోజుల శిక్షణ కార్యక్రమం మూడోవ రోజుకు చేరింది. రాజమండ్రి వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ అండ్ హెడ్ డాక్టర్ పి.ఉషారాణి హాజరై శిక్షణ అందజేశారు. ఆమె మాట్లాడుతూ వివిధ పోషకాలు ఆవశ్యకత, మొక్కలు, వివిధ పంటలు, ప్రధాన ద్వితీయ, సూక్ష్మపోషకాలు, ఏఏ మోతాదులలో ఏ పంటలకు వాడాలి తదితర విషయాలను వెల్లడించారు. మోతాదులకు మించి ఎరువులను వాడితే నేల కలుషితం అవుతుందని చెప్పారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బి.పెద్దబాబు మాట్లాడుతూ నేలల పరిరక్షణ, పర్యావరణం, జీవన వైవిధ్యం తదితర విషయాలపై చర్చించారు. ప్యాక్స్ సభ్యులు పాల్గొన్నారు.

సుందరీకరణపై మునిసిపాలిటీ నిర్లక్ష్యం


మట్టిదిబ్బలతో దర్శనమిస్తున్న లాకురోడ్డు

నరసాపురం: పట్టణ సుందరీకరణ విషయంలో మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కడబడితే అక్కడ రోడ్డు పక్కన పిచ్చిమొక్కలు, మట్టి దిబ్బలు దర్శనమిస్తున్నాయి. లాకులు నుంచి కొండాలమ్మ గుడి వరకు గోదావరి గట్టు వెంబడి, మత్స్యపురి వంతెన నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు పంట కాలువ వెంబడి ప్లాట్‌ఫామ్ రెయిలింగ్ పలు చోట్ల ధ్వంసమైంది. కొండాలమ్మ గుడి ప్రాంతంలో మార్బుల్స్ రెయిలింగ్ చోరుల పాలవుతోంది. గోదావరి బండ్‌కు వెళ్లే మార్గంలో నిర్మించిన రోడ్లు నిరుపయోగంగా మారాయి. రోడ్డు పక్కన మట్టిదిబ్బలు దర్శనమిస్తున్నాయి. రోడ్డు వెంబడి ప్రైవేటు వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పరిస్థితిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

11న శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న ఇస్కాన్ ఇన్‌చార్జ్ మురళీనాథ్ శ్యామ్‌దాస్

తణుకు అర్బన్: శ్రీ కృష్ణ జన్మాష్టమి మహోత్సవాల్లో భాగంగా తణుకులో ఈనెల 11న రాధాకృష్ణుల మహాభిషేకాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు శ్రీకారం చుట్టినట్లు ఇస్కాన్ తాడేపల్లిగూడెం ఇన్‌చార్జ్ మురళీనాథ్ శ్యామ్‌దాస్ పేర్కొన్నారు. తణుకు ఇస్కాన్ మందిరంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తణుకు శ్రీభోగవల్లి బాపయ్య, అన్నపూర్ణమ్మ కమ్మ కల్యాణ మండపంలో సాయంత్రం 5 గంటల నుంచి హరేకృష్ణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా హరినామ సంకీర్తన, ప్రవచనం, జప మెడిటేషన్, శ్రీరాధాకృష్ణుల మహాభిషేకం, అభిషేక సేవ దాతలచే వెన్నముద్ద గోపాలుడికి స్వీయ హస్తాలతో అభిషేకం, చప్పనభోగ సమర్పణ, మహా హారతి, మహాప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు కన్నులపండువగా నిర్వహించనున్నామని భక్తులంతా శ్రీకృష్ణ భగవానుడి మహోత్సవాలను కనులారా తిలకించి భగవద్‌అనుగ్రహం పొందాలని కోరారు. ఈ కృష్ణాష్టమి మహోత్సవాలను వీక్షించేందుకు అందరూ ఆహ్వానితులేనని స్పష్టం చేశారు. జిల్లా నలుమూలల నుంచి ఇస్కాన్ సభ్యులతో పాటు భక్తులు అధికసంఖ్యలో హరేకృష్ణ మహోత్సవానికి హాజరవుతారని వివరించారు. గత ఏడాదిన్నరగా తణుకులో ఇస్కాన్ తరఫున భగవద్గీత, భాగవత ప్రచారం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో కారుమూరి సత్యనారాయణమూర్తి, పి.సుబ్రహ్మణ్యశర్మ, కారుమూరి శివకుమార్, ప్రఫుల్ల దూతాజి పాల్గొన్నారు.

తణుకులో రాఖీ సందడి

- భారీగా వెలసిన రాఖీ దుకాణాలు
- రాఖీలు కొనేందుకు ఉత్సాహంగా బాలికలు, యువతులు


తణుకు రాష్ట్రపతి రోడ్డులో రాఖీల దుకాణం


వివిధ రకాల రాఖీలు

తణుకు అర్బన్: శ్రావణ పౌర్ణమి సందర్భంగా రాఖీ పండుగ కోసం తణుకులో రాఖీల దుకాణాలు భారీగా వెలిశాయి. ఈ ఏడాది రోడ్డు పొడవునా భారీగా పందిర్లు వేసి రాఖీల విక్రయాలు చేస్తున్నారు. బాలికలు, యువతులు, మహిళలు రాఖీలు కొనుగోలు చేసేందుకు దుకాణాల వద్ద వేచి ఉంటున్నారు. దీంతో గత రెండు రోజులుగా తణుకు మార్కెట్‌లో రాఖీ సందడి నెలకొంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుకాణాలతో పాటు ఫ్యాన్సీ దుకాణాల్లో ఈ రాఖీల అమ్మకాలు శుక్రవారం జోరందుకున్నాయి. శనివారం రాఖీ పౌర్ణమి సందర్భంగా సోదరీమణులు తమ సోదరులకు రక్షా బంధన్ కట్టి ఆశీస్సులు తీసుకోనున్నారు. దీంతో దుకాణాల్లో అమ్మకాలకు రకరకాల మోడల్స్‌లో రాఖీలు సిద్ధంగా ఉన్నాయి. రాఖీల్లో ఉన్న రంగులు, నాణ్యతను బట్టి ఒక్కొక్కటి రూ. 10 నుంచి రూ. 200 వరకు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

రక్షాబంధన్..

అన్నా చెల్లెలు, అక్క తమ్ముడి మధ్య అనుబంధానికి ప్రతీకగా పౌర్ణమి రోజున సోదరీమణులు తమ సోదరులకు రాఖీ కట్టే సంప్రదాయం పూర్వం నుంచి కొనసాగుతుంది. శక్తిస్వరూపిణిగా పిలవబడే ఇంటి ఆడపడుచుచే రాఖీ కట్టించుకున్న సోదరు లకు దేవతలు రక్షగా నిలిచి అరిష్టాలను తొలగిస్తారని, నిండు జీవితాంతం అండగా నిలుస్తారని, రాఖీ కట్టి తనకు జీవితాంతం సోదరుడి స్థానంలో అండగా నిలబడాలని సోదరీమణులు కోరుకుంటారని పండితులు చెబుతుంటారు. దీంతో ఈ రక్షాబంధన్ ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అంతేకాకుండా ఏ రక్తసంబంధం లేకపోయినా సోదరుడిగా భావించి ఇరుగుపొరుగు వారు సైతం ఈ రాఖీ పండుగ వేదికగా అన్నాచెల్లెలు, అక్కాతమ్ముడి అనుబంధాన్ని ఏర్పరచుకుంటున్నారు. సోదరీమణులు తమ సోదరుడికి నుదుటిన కుంకుమ అద్ది రాఖీ కట్టి మిఠాయి తినిపించగా సోదరుడు బహుమతి అందచేసే సంస్కృతి అనాదిగా నడుస్తోంది. ఎంతో దూరంగా ఉన్నవారు సైతం రాఖీ పండుగకు కలుసుకునే వెసులుబాటు ఉండగా నేటి ఆధునిక యుగంలో ఆన్‌లైన్‌లో రాఖీని పంపించే పరిస్థితి వచ్చింది.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి వత్రాలు


ఇరగవరంలో విశేష అలంకరణలో దుర్గమ్మతల్లి

ఇరగవరం: మండలంలో 21గ్రామాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పవిత్ర శ్రావణమాసం రెండో శుక్రవారం ఉదయం నుంచి ఇళ్లల్లో వరలక్ష్మి మాతను ప్రతిష్ఠించి పూజలు చేశారు. మహిళలు షడ్రుచులతో పిండి పదార్థాలు తయారు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. పూజల అనంతరం ముత్తైదువులకు వాయినాలు అందించారు. సాయంత్రం అమ్మవారికి మరోసారి పూజలుచేసి, ఆలయాల్లో అమ్మవార్లను దర్శించుకొని పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయాలు అన్నీ భక్తులతో కిటకిటలాడాయి.

బలుసులమ్మ ఆలయంలో ...

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో బలుసులమ్మ అమ్మవారికి శ్రావణ శుక్రవారం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. అమ్మవారిని విశేషంగా అలంకరించారు. భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. దాతలు కుకునూరి నరసింహమూర్తి నాగలక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులచే అన్న ప్రసాదాలు హాజరైన భక్తులకు అందజేశారు. నిర్వాహకులు శ్రీరంగం అంజి పర్యవేక్షించారు. అలాగే స్థానిక జువ్వలపాలెంలో లలితాదేవి ఆలయంలో అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. దాతలు కొలనువాడ వెంకట శివరామరాజు, పట్టణానికి చెందిన మెహర్‌ల సౌజన్యంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.


లలితాదేవి అమ్మవారు


విశేష అలంకరణలో బలుసులమ్మ అమ్మవారు

కేబుల్ వైర్ల దగ్ధం


దగ్ధమవుతున్న కేబుల్ వైర్లు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ఏలూరు రోడ్డులోని సాయిబాబా టెంపుల్ దగ్గర కాలనీలో శుక్రవారం ఉదయం విద్యుత్ స్తంభానికి కట్టి ఉన్న కేబుల్ వైర్లకు మంటలు అంటుకున్నాయి. స్థానికుల సమాచారం మేరకు ఫైర్ ఆఫీసర్ మురళీ కొండబాబు ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని సీఓ2 సహాయంతో మంటలను అదుపు చేశారు. స్థానికులు నుంచి వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదని తెలిపారు.

తాడేపల్లిగూడెంలో అగ్ని ప్రమాదం.. ఐసర్ వ్యాన్ దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఎస్వీఆర్ సర్కిల్ సమీపంలో పెయింటింగ్ వేస్తుండగా కార్మికుల ముందే ప్రమాదవశాత్తు ఐసర్ వ్యాన్‌కు మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఫైర్ ఆఫీసర్ మురళీ కొండబాబు ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదని, కేబిన్, టైర్లు, వైరింగ్, ఇంజన్ కాలిపోవడంతో నష్టం సంభవించింది.

పంచాయతీ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు రాజు

తాడేపల్లిగూడెం రూరల్: పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాస్, ఏఐటీయూసీ తాడేపల్లిగూడెం ఏరియా అధ్యక్షుడు ఓవి.రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని జగన్నాథపురం ఎస్‌డబ్ల్యూఎం షెడ్డు వద్ద సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న శానిటరీ, అర్హత గల సెమీ స్కిల్డ్, కార్మికులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం శ్రీనివాస్, రాజు మాట్లాడుతూ కార్మికుల డిమాండ్లను సాధించడమే కాకుండా వారి హక్కులను రక్షించేందుకు యూనియన్‌ను బలోపేతం చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా యూనియన్ కార్యకలాపాలను విస్తరింపజేయాలని, దశలవారీగా ఆందోళన, పోరాట కార్యక్రమాలను నిర్మించాలని సమావేశం నిర్ణయించిందన్నారు. పంచాయతీ కార్మికుల ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఏఐటీయూసీ బాధ్యత తీసుకుంటుందన్నారు. యూనియన్ అధ్యక్షుడు తాడేపల్లి సుబ్బరాజు, ఏరియా ప్రధాన కార్యదర్శి హరీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ కళింగ లక్ష్మణరావు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.